క్లుప్తంగా

టెన్త్ విద్యార్థులకు ఉచిత బస్సు ప్రయాణం

డోన్ టౌన్: పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ఆర్టీసీ పల్లె వెలుగు బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పిస్తున్నట్లు డోన్ డిపో మేనేజర్ శశిభూషణ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 17వ తేదీ నుంచి 31వ తేదీ వరకు 10వ తరగతి పబ్లిక్ పరీక్షలు జరగనున్నాయి. ఈ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు బస్ పాస్ లేకున్నా హాల్ టిక్కెట్ చూపించి వారి నివాస స్థలం నుంచి పరీక్ష కేంద్రానికి, పరీక్ష కేంద్రం నుంచి నివాస స్థలానికి ఉచితంగా ప్రయాణించవచ్చని పేర్కొన్నారు. విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

వ్యవసాయానికి ఈవారం విద్యుత్ వేళలు

కోవెలకుంట్ల: మండలంలోని ఆయా ఫీడర్ల పరిధిలో సోమవారం నుంచి వ్యవసాయ రంగానికి పగటి వేళల్లో తొమ్మిది గంటల విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు ఆ శాఖ ఏఈ అనంతరావు చెప్పారు. కోవెలకుంట్ల, కలుగొట్ల, కొప్పెర్ల ఫీడర్ల పరిధిలోని భీమునిపాడు, అమడాల, గుంజలపాడు, జోళదరాశి, కలుగొట్ల, అల్లూరు, కొత్తపల్లె గ్రామాలకు సంబంధించి ఉదయం 7.30 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉంటుందన్నారు. గుళ్లదూర్తి, పాట్టిపాడు, హరివరం, రేవనూరు, లింగాల, గుండుపాపల గ్రామాలకు సంబంధించి ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉంటుందని పేర్కొన్నారు.

సంజామలలో విద్యుత్ వేళలు

సంజామల: మండలంలోని సంజామల, ఆకుమల్ల, పేరుసోముల, నొస్సం సబ్‌స్టేషన్‌ల పరిధిలో ఈ వారం వ్యవసాయానికి ఉదయం 7:30 గంటల నుంచి సాయంత్రం 4:30 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉంటుందని ఏఈ మధుసూదన్ యాదవ్ తెలిపారు. ముక్కమల్ల, ఆల్వకొండ, రెడ్డిపల్లె, వసంతాపురం, కమలపురి, ముదిగేడు, కానాల, అక్కంపల్లె, గిద్దలూరు, ఆర్.లింగందిన్నె, రామిరెడ్డిపల్లె, మిక్కినేనిపల్లె ఫీడర్ల పరిధిలోని గ్రామాల్లో పగటి పూట 9 గంటల విద్యుత్ సరఫరా చేయనున్నట్లు పేర్కొన్నారు.

ఘనంగా మారెమ్మ విగ్రహ ప్రతిష్ట



పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

సంజామల: మండల పరిధిలోని గుండ్లశింగవరం గ్రామంలో మారెమ్మ విగ్రహ ప్రతిష్ట వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. మూడు రోజుల పాటు విశేష పూజలు నిర్వహించి చివరి రోజున మారెమ్మ దేవత, నాగుల విగ్రహాలను ప్రతిష్టించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామంలో నిర్వహించిన అన్నదాత కార్యక్రమంలో పాల్గొన్నారు. వారి వెంట వైఎస్సార్‌సీపీ అవుకు మండల కన్వీనర్ కాటసాని తిరుపాల్ రెడ్డి, సర్పంచ్ కాటసాని రామాకాంత్‌రెడ్డి, నాయకులు కాటసాని ప్రసాద్‌రెడ్డి, అన్నవరం ఎంపీటీసీ గోపవరం గోపాల్ రెడ్డి ఉన్నారు.

16న హలో మాల - చలో ఒంగోలు

బనగానపల్లె రూరల్: ఈ నెల 16వ తేదీ తలపెట్టిన హలో మాల- చలో ఒంగోలు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రాష్ట్ర మాల మహానాడు ఉపాధ్యక్షుడు దస్తగిరి పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక మాలమహానాడు కార్యాలయంలో కార్యక్రమ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దస్తగిరి మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధమన్నారు. వర్గీకరణకు వ్యతిరేకంగా 16న ఒంగోలులో జరిగే కార్యక్రమానికి రాష్ట్ర మాలమహానాడు అధ్యక్షుడు మల్లెల వెంకట్రావు, మంత్రి డోలా వీరాంజనేయులుతో పాటు మరికొందరు ప్రముఖులు హాజరవుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో మాలమహానాడు రాయలసీమ జిల్లాల అధ్యక్షులు బొల్లిమద్దిలేటి, రాష్ట్ర నాయకులు ఎం.నాగరాజు, కె.శివుడు, సత్యం,భాస్కర్ ప్రసాద్ పాల్గొన్నారు.

రోగులకు పౌష్టికాహారం పంపిణీ



పౌష్టికాహారం పంపిణీ చేస్తున్న దృశ్యం

డోన్: స్థానిక వంద పడకల ప్రభుత్వాసుపత్రిలో రోగులు, గర్భిణులు, బాలింతలకు ఆదివారం హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ హనీఫ్ ఆధ్వర్యంలో పౌష్టికాహారం పంపిణీ చేశారు. ప్యాపిలి మండలం బావిపల్లె గ్రామానికి చెందిన మల్‌రెడ్డి జనార్దన్ ఆర్థిక సహాయంతో ప్రార్థన సమయం నిర్వాహకుడు జాన్‌ప్రభాకర్ రోగులకు రొట్టె, గుడ్డు, పప్పు, అరటిపండును అందజేశారు.

సచివాలయ వ్యవస్థకు తూట్లు

- రెండు సచివాలయాలు ఒకటిగా విలీనానికి సిద్ధం
- నివేదికలు తయారు చేస్తున్న అధికారులు
- ప్రజలకు దూరం కానున్న సేవలు



తుమ్మలపెంట గ్రామ సచివాలయం

కొలిమిగుండ్ల: గ్రామాల్లోనే ప్రజలకు అన్ని రకాల సేవలు అందించాలనే మంచి ఆశయంతో గ్రామ స్వరాజ్య సాధన దిశగా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గ్రామ సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చింది. దీంతో గ్రామాల్లో 530 రకాల సేవలు సకాలంలోనే అందుతుండేవి. ప్రజలు మండల కేంద్రాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా వ్యయప్రయాసలు తప్పేవి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గాంధీజీ కలలు కన్న సచివాలయ వ్యవస్థను నిర్వీర్యం చేసే దిశగా అడుగులు వేస్తోంది. కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాల వల్ల పల్లె ముంగిట ప్రభుత్వ సేవలు దూరం కానున్నాయి. ఇకపై రెండు సచివాలయాలను కలిపి ఒక సచివాలయంగా ఏర్పాటు చేసేందుకు అధికారులు క్షేత్ర స్థాయిలో కసరత్తు చేస్తున్నారు. ఇప్పటికే ఎంపీడీఓలు, కార్యదర్శులు సచివాలయాల కుదింపు ఎలా చేయాలనే దానిపై విస్తృతంగా చర్చలు చేస్తున్నారు. రెండు సచివాలయాలు ఉన్న చోట ఒకటి చేసేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. కొన్ని చోట్ల ఒక్క గ్రామానికే సచివాలయాలు ఏర్పాటు అయ్యాయి. వాటిని సమీపంలోని మరొక సచివాలయానికి అనుసంధానం చేయనున్నారు. కొన్ని చోట్ల మాత్రం సచివాలయాలు లేకుండా చేస్తే ప్రజలు సుదూరంగా వెళ్లాల్సి వస్తుంది. అలాంటి వాటిని ఎలా చేయాలనే దానిపై అధికారులు అలోచిస్తున్నారు. నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో 79 గ్రామ సచివాలయాలు ఉన్నాయి. విలీనం అయితే సగానికి తగ్గే అవకాశాలు కనిపిస్తున్నాయి.

ఉద్యోగుల సంఖ్య తగ్గనుంది

సచివాలయాల్లో 11 మంది ఉద్యోగులు ఉన్న చోట వారిని ఇతర ప్రాంతాలకు బదిలీ చేసి కుదించే చర్యలు జరుగుతున్నాయి. వెల్ఫేర్ అసిస్టెంట్, వీఆర్వో, కార్యదర్శి, డిజిటల్ అసిస్టెంట్, ఇంజినీరింగ్ అసిస్టెంట్, వ్యవసాయం, వెటర్నరీ, ఏఎన్ఎం, మహిళా పోలీసు తదితరులు విధులు నిర్వహిస్తున్నారు. ఈ ఉద్యోగుల్లో ప్రధానంగా వెల్ఫేర్, వీఆర్వో, కార్యదర్శి, డిజిటల్ అసిస్టెంట్‌తో మొత్తం తొమ్మిది మంది మాత్రమే పని చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. మిగిలిన ఉద్యోగులను ఆయా శాఖలకు బదలాయింపు చేసేందుకు కసరత్తు చేస్తున్నారు.

ప్రజలకు తప్పని తిప్పలు

సచివాలయాలను విలీనం చేయనుండడంతో వివిధ రకాల సేవల కోసం ప్రజలు ఇబ్బందులు పడాల్సి వస్తుంది. ఉన్న ఊర్లలోనే సేవలు పొందే గ్రామస్తులు ఇకపై వేరే ఊర్లకు వెళ్లాల్సిన పరిస్థితులు త్వరలో ఏర్పడనున్నాయి. కనీసం నాలుగైదు కిలో మీటర్ల పైబడి దూరం ప్రయాణించాల్సి వస్తుంది. పనులు మానుకుని సచివాలయాలకు వెళ్లినా అక్కడ సిబ్బంది ఉంటారా.. లేక ఫీల్డ్ విజిట్‌లకు పోయి ఉంటారో తెలియని పరిస్థితి ఉంటుందని ప్రజలు చర్చించుకుంటున్నారు. ఉన్న ఊర్లలోనే పనులు చేసుకుని తీరిగ్గా సచివాలయాల్లో సేవలు పొందేవాళ్లమని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

నియోజకవర్గంలో గ్రామ సచివాలయాల వివరాలు

మండలం	సచివాలయాల సంఖ్య
కొలిమిగుండ్ల	16
అవుకు	18
సంజామల	11
కోవెలకుంట్ల	11
బనగానపల్లె	23

విలీనంపై కసరత్తు జరుగుతోంది

ఉన్నతాధికారుల నుంచి వచ్చిన ఆదేశాల మేరకు గ్రామ సచివాలయాల విలీనంపై కసరత్తు జరుగుతోంది. రెండు ఉన్న చోట ఒకటి చేస్తున్నాం. కొన్ని చోట్ల సింగిల్‌గా ఉన్న వాటిని ఎలా చేయాలనే దానిపై ఆలోచిస్తున్నాం. విలీనం అయినా సిబ్బంది రెండు చోట్ల ఉంటారు.

–ప్రసాదరెడ్డి, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ

ఇంటికి తాళం వేసి వ్యాపారి అదృశ్యం?

డోన్ టౌన్: పట్టణంలో ఐపీల పరంపర కొనసాగుతూనే ఉంది. కొద్ది నెలల క్రితం ఒక వ్యక్తి.. గత నెలలో ఓ వ్యాపారి ఐపీలు పెట్టిన సంఘటనలు మరువక ముందే మరో వ్యాపారి వారం నుంచి అదృశ్యం కావడంతో ఇతనితో ఆర్థిక సంబంధాలు కలిగిన వారు ఆందోళన చెందుతున్నారు. పట్టణంలోని కొండపేట దర్గా సమీపంలో నివాసం ఉంటున్న ఇతను ఇంటికి తాళం వేసి ఫోన్ స్విచ్చాఫ్‌లో ఉంచుకోవడం.. కుటుంబ సభ్యులు కూడా కనిపించకపోవడంతో పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఇతని స్వగ్రామం ప్యాపిలి మండలం ఎనుగుమర్రి అని తెలిసింది. కొండపేటలో నివాసం ఉంటూ రైతుల వద్ద ధాన్యం కొనుగోలు చేస్తూ విత్తనాలు విక్రయిస్తూ ఉండేవాడని సమాచారం. డోన్ మండలంలోని పలు గ్రామాలతో పాటు తుగ్గలి మండలం పగిడిరాయి, కొత్తూరు, రాంకొండ, పెండేకల్లు, రాంపల్లెతో పాటు మరికొన్ని గ్రామాల్లో రైతుల వద్ద ధాన్యం కొనుగోలు చేసి వారికి డబ్బులు ఇవ్వలేదని తెలిసింది. అంతే కాకుండా పట్టణంలోని పలువురి వద్ద వడ్డీలకు లక్షల్లో అప్పులు చేసినట్లు.. పలువురి వద్ద చీటీలు ఎత్తి డబ్బులు చెల్లించలేదనే వార్తలు వినిపిస్తున్నాయి. సుమారు రూ.7–8 కోట్లు అప్పు కావడంతో ఐపీ పెట్టడానికి అదృశ్యం అయినట్లు పట్టణంలో జోరుగా ప్రచారం జరుగుతోంది. మూడు నెలల క్రితం పట్టణంలోని ఇంటిని సైతం యూనియన్ బ్యాంక్ సమీపంలోని ఓ హోటల్ నిర్వాహకుడికి విక్రయించడం మరింత బలం చేకూరింది. అసలు విషయం ఏమోగానీ ఈయనకు అప్పులు ఇచ్చిన వారు, చీటీల నిర్వాహకులు, ధాన్యం విక్రయించిన రైతులు మాత్రం ఆందోళన చెందుతున్నారు.

వైభవంగా విగ్రహాల ప్రతిష్ట



మహా నవశిర నాగేంద్ర గురుపీఠ ప్రతిష్ట అనంతరం పూజలు చేస్తున్న భక్తులు



కాశీ విశ్వనాథ ఆలయంలో ప్రతిష్టించిన వల్లీదేవసేన సమేత సుబ్రమణేశ్వరస్వామి విగ్రహాలు

కోవెలకుంట్ల: పట్టణంలోని గాంధీసెంటర్‌లో నూతనంగా నిర్మించిన అన్నపూర్ణ సమేత కాశీవిశ్వనాథ స్వామి ఆలయం, పట్టణ శివారులోని పాటిమీద అంజనేయస్వామి ఆలయ ఆవరణలో ఆదివారం విగ్రహాల ప్రతిష్ట వైభవంగా నిర్వహించారు. ఆయా అలయాల్లో ఈ నెల 7వ తేదీ నుంచి మూడు రోజులపాటు ప్రతిష్టోత్సవాలు జరిగాయి. ఉత్సవాల్లో చివరి రోజు పాటిమీద ఆంజనేయస్వామి ఆలయంలో ప్రాణ ప్రతిష్ట, మూర్తిస్థాపన, ధ్వజస్తంభ, వేలాయధస్థాపన, మహాగణపతి పూజ, శ్రీలక్ష్మి కుబేర పూజ, సామూహిక పూజ, పూర్ణాహుతి కార్యక్రమాలు జరిగాయి. అలాగే కాశీ విశ్వనాథ స్వామి ఆలయంలో యంత్రప్రతిష్ట, ధ్వజ, శిఖరకలశ, విగ్రహ ప్రతిష్ట, హోమం, ప్రాణప్రతిష్ట, కళాన్యాసం, పూర్ణాహుతి, కలశ, ఉద్వాసన, ప్రోక్షణ, అలంకరణ, కూష్మాండబలి, మహామంగళహారతి తదితర కార్యక్రమాలు కొనసాగాయి. భక్తులు అధిక సంఖ్యలో చేరుకుని స్వామివార్లకు పూజలు నిర్వహించారు. ఆలయ ఆవరణల్లో భక్తులకు అన్నదానం చేశారు.



ప్రహరీ లేకపోవడంతో కార్యాలయం ఎదురుగా పందుల సంచారం

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం.. పందులకు నిలయం

ప్యాపిలి: స్థానిక సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి ప్రహరీ గోడ, గేటు లేకపోవడంతో సిబ్బంది, ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. ప్యాపిలిలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని బ్రిటీష్ కాలంలో నిర్మించారు. అయితే అప్పటి భవనం శిథిలావస్థకు చేరడంతో కొన్ని సంవత్సరాల క్రితం కార్యాలయానికి మరమ్మతులు చేసి ఆధునీకరించారు. కాగా స్థానిక ప్రధాన రహదారి నుంచి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి అనువైన దారి లేకపోవడంతో సిబ్బందితో పాటు కార్యాలయానికి వచ్చే ప్రజలు అసౌకర్యానికి గురవుతున్నారు. కార్యాలయానికి ప్రహరీ గోడ నిర్మించి గేటు ఏర్పాటు చేయాలని కొన్నేళ్లుగా ఇక్కడ పని చేసిన సబ్‌రిస్ట్రార్‌లు ప్రజాప్రతినిధులకు ఇచ్చిన వినతి పత్రాలు బుట్టదాఖలవుతున్నాయి. ప్రహరీ, గేటు లేకపోవడంతో కార్యాలయం ఆవరణ పందులకు ఆవాసంగా మారింది. పందుల బారి నుంచి తప్పించుకునే ప్రయత్నంలో ద్విచక్రవాహన చోదకులు తరచూ కిందపడుతున్నారు. ఈ కార్యాలయం ద్వారా ప్రభుత్వానికి ఏటా రూ. 5 కోట్ల ఆదాయం సమకూరుతోంది. అయితే కార్యాలయ ఆవరణ మాత్రం అసౌకర్యాలకు నిలయంగా మారింది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి రోడ్డు సౌకర్యం ఏర్పాటు చేయడంతో పాటు ప్రహరీ, గేటు నిర్మాణం చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

కాటికాపరుల సమస్యలు పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎల్లయ్య

బేతంచెర్ల: కాటికాపరుల సమస్యలను పరిష్కరించాలని కేవీపీఎస్ నాయకులు ఎల్లయ్య, వేణుగోపాల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శ్మశాన వృత్తిదారుల సంఘం నాయకులు చిన్న మాధవకృష్ణ, బొల్లిమద్దిలేటి ఆధ్వర్యంలో ఆదివారం ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. శ్మశానంలో పనిచేసే వృత్తిదారులను ప్రభుత్వం గుర్తించకపోవడం దారుణం అన్నారు. వీరిని గుర్తించి ప్రమాద బీమా, ఆరోగ్య బీమా కల్పించి మూడు సెంట్ల స్థలం ఇచ్చి ఇళ్లు నిర్మించి ఇవ్వాలని కోరారు. సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 12వ తేదీ తలపెట్టిన చలో విజయవాడలో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో మధుసుధాకర్, రామసుబ్బయ్య, వెంకటేశ్వర్లు, మురళీకృష్ణ, గోపాల్, నగేష్, రేవంత్, నాగరాజు, రంగడు, నాగమధు తదితరులు పాల్గొన్నారు.

ప్లీజ్.. నన్ను నిలబెట్టండి



బెలుం బస్టాప్ వద్ద పడిపోయిన కిలో మీటర్ రాయి

కొలిమిగుండ్ల: సాధారణంగా ఏ రోడ్డు పక్కన చూసినా కిలోమీటర్ రాళ్లు కనిపిస్తుంటాయి. ఒక గ్రామం నుంచి మరొక గ్రామానికి ఎంత దూరం ఉందో తెలిపేందుకు ఏర్పాటు చేస్తారు. గ్రామీణ రోడ్లు, జాతీయ రహదారుల పక్కన దర్శనమిస్తుంటాయి. వెయ్యి మీటర్లు ఒక కిలోమీటర్‌గా కొలుస్తారు. కి.మీ రాళ్లు రోడ్డును బట్టి రంగు మారుతుంటాయి. బెలుం బస్టాప్ వద్ద కిలోమీటర్ రాయి చాలా రోజుల నుంచి పడిపోయి ఉంది. అధికారులు పాతి ఉంచాక ఎవరైనా తీసి పక్కన పెట్టారో తెలియదు. అనంతపురం–అమరావతి జాతీయ రహదారి కావడంతో రోజు వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఇక్కడ చూస్తే కి.మీ రాయి కింద ఉండడంతో వాహనదారులు ఆశ్చర్యంగా చూస్తున్నారు.

లైఫ్ సర్టిఫికెట్లను అందజేయాలి

డోన్: ప్రభుత్వ పెన్షన్‌దారులందరూ వీలైనంత త్వరగా లైఫ్ సర్టిఫికెట్లను స్థానిక సబ్‌ట్రెజరీ కార్యాలయాల్లో అందజేయాలని రాష్ట్ర పెన్షనర్ల సంఘం కార్యదర్శి భానుసింగ్ కోరారు. ఆ సంఘం డోన్ కార్యాలయంలో ఆదివారం ఆయన మాట్లాడారు. త్వరలోనే కర్నూలు సాయి సత్య హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత ఆర్థోపెడిక్ క్యాంపును నిర్వహిస్తామన్నారు. క్యాంపును ప్రతి ఒక్క ప్రభుత్వ పెన్షనర్‌తో పాటు బయటి వ్యక్తులు కూడా సద్వినియోగం చేసుకోవచ్చని తెలిపారు. పెన్షనర్ల సంఘం గౌరవాధ్యక్షుడు సుబ్బరాయుడు, కార్యదర్శి గాలయ్య, కోశాధికారి గోపాల్, సంఘం నాయులు రామక్రిష్ణా రెడ్డి, లక్ష్మిరెడ్డి, రామదాస్‌రెడ్డి, ఉసేన్‌సాహెబ్, నరసింహులు పాల్గొన్నారు.

టిప్పర్‌ను ఢీకొన్న ఆర్టీసీ బస్సు

- త్రుటిలో తప్పని ప్రమాదం



పాక్షికంగా ధ్వంసమైన ఆర్టీసీ బస్సు

బనగానపల్లె రూరల్: పట్టణంలోని వైఎస్సార్ సర్కిల్‌లో ఆదివారం ఆర్టీసీ బస్సు–టిప్పర్ ఢీకొన్నాయి. త్రుటిలో పెనుప్రమాదం తప్పింది. స్థానికుల వివరాల మేరకు.. ఉదయం ప్రొద్దుటూరు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు కర్నూలు నుంచి బనగానపల్లె వస్తుండగా పట్టణంలోని పెట్రోల్‌బంకు సమీపంలోని వైఎస్సార్ సర్కిల్ మలుపు వద్ద ఆర్టీసీ బస్టాండ్ వైపు నుంచి నంద్యాల వెళ్తున్న టిప్పర్‌ను బస్సు ఢీకొంది. బస్సు ముందు వైపు ఉన్న అద్దం ధ్వంసమైంది. బస్సు పాక్షికంగా దెబ్బతింది. అయితే ప్రయాణికులకు ఎలాంటి గాయాలు కాకపోవడంతో ప్రయాణికులు ఊపిరిపీల్చుకున్నారు. ఆర్టీసీ బస్సు నిర్లక్ష్యంగా నడపడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు పేర్కొన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కోలుకోలేక వ్యక్తి మృతి

కర్నూలు(అగ్రికల్చర్): ఈ నెల 5న బళ్లారి చౌరస్తా నుంచి కోడుమూరు వెళ్లే రోడ్డులో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో చికిత్స పొందుతున్న కాటిపోగు శేఖర్ (37) కోలుకోలేక ఆదివారం మరణించారు. నంద్యాల జిల్లా, మిడుతూరు మండలం, ఆలగనూరు గ్రామానికి చెందిన కాటిపోగు శేఖర్ స్కూటీపై అత్తగారి గ్రామమైన పెద్దపాడు వెలుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. క్షతగాత్రుడిని 4వ పట్టణ పోలీసులు చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ కోలుకోలేక మరణించారు. మృతుడికి ఒక కుమారుడు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. 4వ పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకొని విచారణ చేస్తున్నారు.

జిల్లా స్థాయి కబడ్డీ జట్ల ఎంపిక పోటీలు

నంద్యాల(న్యూటౌన్): కబడ్డీ సబ్ జూనియర్ ఉమ్మడి జిల్లా స్థాయి బాల బాలికల జట్ల ఎంపిక పోటీలు శ్రీవెంకటేశ్వర విద్యామందిర్ క్రీడా మైదానంలో ఆదివారం నిర్వహించినట్లు ఉమ్మడి జిల్లా కబడ్డీ అసోసియేషన్ సెక్రటరీ ఏపీ రెడ్డి తెలిపారు. 34వ సబ్ జూనియర్ బాలురు, బాలికల పోటీలను కాశిరెడ్డినాయన ఆశ్రమ నిర్వాహకులు శివశంకర్‌రెడ్డి, మల్లికార్జునరెడ్డి ప్రారంభించారు. ఉమ్మడి జిల్లా స్థాయిలో ఎంపికైన క్రీడాకారులు ఈనెల 14 నుంచి 16వ తేదీ వరకు వైఎస్సార్ కడప జిల్లాలోని పులివెందులలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. నంద్యాల జిల్లా స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి దండెనాగరాజు పాల్గొన్నారు.

బాల్ బ్యాడ్మింటన్ విజేత బనగానపల్లె



హోరాహోరీగా తలపడుతున్న శ్రీకాళహస్తి, బనగానపల్లె జట్లు



విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న నిర్వాహకులు

కోవెలకుంట్ల: పట్టణంలోని సంస్కృత పాఠశాల క్రీడామైదానంలో రెండు రోజులపాటు నిర్వహించిన రాయలసీమస్థాయి బాల్‌బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో బనగానపల్లె జట్టు విజేతగా నిలిచింది. అనంతపురం, ధర్మవరం, నగరి, నంద్యాల, కర్నూలు, శ్రీకాళహస్తి, బనగానపల్లె, కోవెలకుంట్ల ప్రాంతాల నుంచి 32 జట్లు పోటీల్లో పాల్గొన్నాయి. బనగానపల్లె సాంబమూర్తి, తిరుపతి జిల్లా నగరికి చెందిన గోపి జట్లు ఫైనల్స్‌లో తలపడగా బనగానపల్లె జట్టు విజేతగా నిలిచి రూ. 15వేలు ప్రథమ బహుమతి కైవసం చేసుకుంది. రన్నర్స్‌గా నగరి జట్టు రూ. 12 వేలు, నంద్యాల నంది జట్టు మూడో స్థానంలో రూ. 10 వేలు, కర్నూలుకు చెందిన ఐజీఎంఎం జట్టు నాల్గవ స్థానంలో రూ. 8 వేలు గెలుపొందాయి. ఆదివారం విజేతలకు నిర్వాహకులు కాత్రెడ్డి మల్లికార్జునరెడ్డి, పెద్దబాబు, మురళీమోహన్, భాస్కర్‌రెడ్డి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో రిటైర్డ్ హెచ్‌ఎం జీవీ సుబ్బారెడ్డి, షటిల్ టోర్నమెంట్ క్రీడాకారుడు శంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

శాకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



గాంధీ విగ్రహం వద్ద ర్యాలీ నిర్వహిస్తున్న శాకాహారులు

డోన్ టౌన్: శాకాహారమే మానవులకు సరైన ఆహారం అని.. దీనితోనే సంపూర్ణ ఆర్యోగం సిద్ధిస్తుందని ధ్యాన పిరమిడ్ కేంద్రం నిర్వాహకులు అన్నారు. ఆదివారం అహింసా ధ్యాన మహోత్సవంలో భాగంగా డోన్ పట్టణంలో వందల మందితో మెగా శాకాహార ర్యాలీ నిర్వహించారు. అనంతరం పాత బస్టాండ్ గాంధీ విగ్రహం వద్ద వారు మాట్లాడుతూ.. జీవహింస మహాపాపం అని తెలిపారు. శాకాహారమే మానవా ఆహారం మరియు అమృతాహారం అన్నారు. ఏ దేవతా రక్తాని.. మాంసాన్ని బలి కోరదని పేర్కొన్నారు. మొక్కుల పేరుతో కొందరు జరుపుతున్న జంతుబలులు అనాగరికం, మూఢ విశ్వాసం మాత్రమే అన్నారు. పక్షిజాతి, జంతు జాతులను స్వేచ్ఛగా బతకనిస్తూ ప్రకృతి సమతుల్యతను కాపాడుదాం, మానవాళి మనుగడకు పాటుపడుదాం అని పిలుపునిచ్చారు. ప్రతి రోజు ధ్యానం చేయడం వల్ల అనేక లాభాలు ఉన్నాయని తెలిపారు. అనంతరం వెంకటాచలం ఫంక్షన్ హాల్‌లో యోగా, ధ్యానం ప్రాముఖ్యతను వివరిస్తూ పద్ధతులను తెలియజేశారు. డోన్‌లో ధ్యాన పిరమిడ్ కేంద్రం భవన నిర్మాణానికి భూమి పూజ చేశారు. కార్యక్రమంలో పత్రీజీ ధ్యాన పిరమిడ్ సభ్యులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యం.. అధ్వానం



ఆలయం ఎదురుగా ప్రవహిస్తున్న మురుగు నీరు



నల్లబల్లి సుంకులమ్మ ఆలయం

ప్యాపిలి: మండల పరిధిలోని నల్లబల్లి గ్రామంలో వెలసిన గ్రామదేవతను భక్తులు నల్లబల్లి సుంకులమ్మగా ఆరాధిస్తారు. ప్రతి మంగళవారం వివిధ గ్రామాల నుంచి అధిక సంఖ్యలో ప్రజలు తరలివచ్చి సుంకులమ్మను దర్శించుకుని మొక్కులు తీర్చుకుంటారు. నల్లబల్లి సుంకులమ్మకు కర్నూలు, అనంతపురం జిల్లాలతో పాటు వివిధ జిల్లాల్లో భక్తులు ఉన్నారు. ప్రతి మంగళవారం భక్తుల రాకతో సుంకులమ్మ దేవాలయం భక్తులతో కిటకిటలాడుతుంది. అయితే ఆలయ పరిసరాల్లో పారిశుద్ధ్యం లోపించడంతో భక్తులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో మురుగునీరు నిలువ ఉంటోంది. దీంతో ఆలయ ప్రాంగణం బురదమయంగా మారడంతో అడుగు తీసి అడుగు వేయలేని పరిస్థితి నెలకొంది. డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో ఈ పరిస్థితి నెలకొందని భక్తులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి భక్తుల సౌకర్యార్థం నల్లబల్లి సుంకులమ్మ ఆలయ పరిసరాల్లో డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేసి భక్తులకు సౌకర్యాలు కల్పించాల్సిన అవసరం ఉంది.